క్లుప్తంగా

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కందుకూరు: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు సర్టిఫికెట్లు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ సోమవారం తహసీల్దార్ గోపాల్‌కు వినతి పత్రం అందించారు. కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్ 788లో గతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ సర్టిఫికెట్లు అందించి కబ్జా చూపలేదన్నారు. తాజాగా మళ్లీ ఇస్తున్న సర్టిఫికెట్లలో చాలామంది పాతవారి పేర్లు లేవన్నారు. పాతవారితో పాటు అర్హులైన కొత్త వారికి సర్టిఫికెట్లు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాంచందర్, నాయకులు కుమార్, శేఖర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: డాక్టర్ పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి జంగారెడ్డి, జిల్లా నాయకులు బాల్‌రాజ్‌యాదవ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి, జిల్లా యువ మోర్చా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, మండల కోశాధికారి వెంకట్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, నర్సింహయాదవ్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాకు బీపీ మిషన్లు



బీపీ మిషన్లు అందజేస్తున్న కార్పొరేటర్ మాధవి

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని 24వ డివిజన్ కార్పొరేటర్ తీగల మాధవిరెడ్డి బస్తీ దవాఖానకు బీపీ మిషన్లు అందజేశారు. సోమవారం తన జన్మదినం సందర్భంగా ఆస్పత్రికి అవసరమగు సామగ్రిని వితరణ చేశారు. ప్రతీ సంవత్సరం తన పుట్టిన రోజున ఆస్పత్రికి, అంగన్‌వాడీ కేంద్రాలకు అవసమరయ్యే సామగ్రి అందజస్తున్నానని కార్పొరేటర్ చెప్పారు.

సమ్మె నోటీసు అందజేత



ఎంఈఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కందుకూరు: తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28 నుంచి సమ్మె చేపడుతున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ మేరకు వారు సోమవారం సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజు ఆధ్వర్యంలో ఎంఈఓకు ఈ నోటీసును అందజేశారు. సమస్యలు పరిష్కరించే వరకు వంట చేయమని తెలిపారు.

స్వచ్ఛతపై అవగాహన అవసరం



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న తుక్కుగూడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని తుక్కుగూడ, మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో స్వచ్ఛ భారత్ పథకంలో భాగంగా 'ఇండియన్ స్వచ్ఛత్‌లీగ్ 2.ఓ'ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త వేరు చేయుట తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవలన్నారు. అనంతరం విద్యార్థులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకతల 'బండ'

- ఫైబర్ గ్యాస్ సిలిండర్‌లతో ప్రమాదాలకు గుడ్‌బై
- బరువు, ధర తక్కువ
- ఇనుప బండ ఇబ్బందులకు స్వస్తి

ఒకప్పుడు వంట అంటే కట్టెల పొయ్యే. వాటి స్థానంలో కిరోసిన్ స్టౌలు వచ్చాయి. కాలానుగుణంగా ప్రతీ వంటింట్లో గ్యాస్ సిలిండర్లు వచ్చేశాయి. చిన్న చిన్న పొరపాట్లతో ఇవి పేలి ధన, ప్రాణ నష్టం జరుగుతుండడంతో వీటిని అరికట్టేందుకు నూతనతంగా ఫైబర్ సిలిండర్లు అందుబాటులోకి తీసుకువచ్చారు.



10 కేజీల ఫైబర్ గ్యాస్ సిలిండర్

మహేశ్వరం: గ్యాస్ సిలిండర్ అనగానే మనకు ఇనుముతో తయారైన భారీ బండ గుర్తుకొస్తుంది. రోజు వారీగా ఎంత గ్యాస్ వినియోగిస్తున్నామనేది తెలుసుకునే వీలుండదు. ఈ బండను ఇంట్లో ఒక గది నుంచి నుంచి మరో గదికి తీసుకువెళ్లాలంటే ఎంతో ఇబ్బంది. వీటికి చరమగీతం పాడుతూ ఇండేన్ గ్యాస్ కంపెనీ ఫైబర్ సిలిండర్లను వినియోగంలోకి తీసుకువచ్చింది.

ఇనుప బుడ్డీతో ఇబ్బందులు

వివిధ కంపెనీలు వినియోగదారులకు 14.2 కేజీల గ్యాస్ బండలను అందిస్తుంటాయి. ఇనుప బండ బరువు మరో 16 కేజీల వరకు ఉంటుంది. ఇంత బరువును ఎత్తడమంటే అందరికీ ఇబ్బందే. వంట గదిలో సిలిండర్‌కు తుప్పుపట్టి అది పెట్టిన ప్రాంతంలోనూ మరకలు పడుతుంటాయి. ఇవి ఎంత శుభ్రం చేసినా పోవు. రెగ్యులేటర్ మార్చడం ఇబ్బందే. అనుకోని ప్రమాదాలు జరిగితే ఇది బాంబులా పేలడం ఆస్తి, ప్రాణ నష్టం భారీగా జరిగే ఆవకాశం ఉంటుంది.

సిలిండర్ ప్రత్యేకతలు

- ▲ ఫైబర్ బండను శాస్త్రీయంగా కాంపోజిట్ సిలిండర్ అని పిలుస్తున్నారు.
- ▲ గ్యాస్ సిలిండర్ బరువు ఆరు కేజీలు ఉంటుంది.
- ▲ దేశంలో గ్యాస్ వినియోగం కుటుంబానికి నెలకు తొమ్మిది కిలోలు. దీన్ని దష్టిలో పెట్టుకొని 10 కేజీల గ్యాస్ నింపేలా రూపొందించారు. ఏడాదికి 9 సిలిండర్లే తీసుకోవాలనే నిబంధన దీనికి వర్తించదు. నెలకో సిలిండర్ తీసుకోవచ్చు.
- ▲ గ్యాస్ ఎంత మేర వాడుకున్నామనే విషయం తెలుసుకోవచ్చు.
- ▲ ప్రమాదాలు జరిగినా పేలదు.

ఫైబర్ సిలిండర్ బాగుంది

ఇనుప సిలిండర్ కన్నా ఫైబర్ గ్యాస్ సిలిండర్ తేలికగా ఉంది. ఇటీవల ఈ కనెక్షన్ తీసుకున్నాను. ఇనుప సిలిండర్‌తో ఎప్పుడు ఆందోళనగా ఉండేది. ఇప్పుడే ఆ భయం లేదు. ఎంత వినియోగించామనేది కూడా సులభంగా తెలుస్తుంది.

– డి.హేమ దుర్గ, గృహిణి, మంఖాల్

ఎక్ఛేంజ్‌కు అవకాశం



వినియోగదారులు పాత సిలిండర్ ఇచ్చి ఫైబర్ సిలిండర్ తీసుకోవచ్చు. ఫైబర్ సిలిండర్‌లో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పటికే కనెక్షన్ ఉన్నవారికి మార్పిడి కింద అందజేస్తున్నాం. ఈ అవకాశం వినియోగదారులు ఉపయోగించుకోవాలి. ఫైబర్ సిలిండర్ గురించి అవగాహన కల్పిస్తున్నాం. వినియోగదారుల రక్షణ మా ధ్యేయం.

– జి.రఘుపతి, రూమా ఇండేన్ గ్యాస్ మేనేజర్, మహేశ్వరం

ఫైబర్ గ్యాస్ సిలిండర్ ధర

14.2 కేజీల గ్యాస్ బండకు ప్రస్తుతం రూ.955 తీసుకుంటున్నారు. ఫైబర్ సిలిండర్ 10 కేజీల గ్యాస్ బండ కావడంతో ధర రూ.682 నిర్ణయించారు. కొత్తగా కనెక్షన్ తీసుకోవాలంటే రూ.3500 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది.



విద్యార్థులకు సాక్షి విద్యార్థి స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న కార్పొరేటర్

'సాక్షి' స్టడీ మెటీరియల్‌తో ఉత్తమ ర్యాంకులు

కార్పొరేటర్ స్వప్నారెడ్డి

బడంగ్‌పేట్: 'సాక్షి'దినపత్రిక ఆధ్వర్యంలో వెలువడుతున్న విద్యార్థి స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ర్యాంకులు సాధించాలని 30వ డివిజన్ కార్పొరేటర్ భీమిడి స్వప్నారెడ్డి సూచించారు. సోమవారం ఆమె బడంగ్‌పేట జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ మెటీరియల్‌లో 10వ తరగతి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా అక్షరీకరించారన్నారు. కరెంట్ ఎఫైర్స్, జీకే, సైన్స్, ఫిజిక్స్, మ్యాథ్స్, అంతరిక్ష పరిశోధన వివరాలు, స్పోర్ట్స్, క్రికెట్, న్యూమరికల్, మెంటల్ ఎబిలిటీ, పజిల్స్, వింతలు, విశేషాలు ఇలా ప్రపంచంలో నలుమూలల జరుగుతున్న విషయాలను మన ముందుకు తీసుకువస్తోందన్నారు. ఈ మెటీరియల్ సహకారంతో పది జీపీఏ సాధించిన విద్యార్థులకు నగదు బహుమతితోపాటు అవార్డులు అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.అర్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడిగా సంతోష్

దిల్‌సుఖ్‌నగర్: మాల మహానాడు ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడిగా ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన చవతి సంతోష్‌ను నియమిస్తూ సోమవారం సంఘం జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాన్ని అందజేశాడు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి



మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

మీర్‌పేట: అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి అన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు సోమవారం బాలాపూర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. నర్సిరెడ్డి మాట్లాడుతూ.. 15 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. వారికి రూ.26వేల వేతనం, పెండింగ్ టీఏ, డీఏల బకాయిలను విడుదల చేయడంతో పాటు వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకులు నర్సింహ, ఎల్లయ్య, సుకన్యకుమారి, రేణుక, నీలమణి, సత్తెమ్మ, జానకమ్మ, సరిత, కల్పన తదితరులు ఉన్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన

'ఫ్రెషర్స్' జోష్

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫంక్షన్‌హాల్‌లో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపకురాలిగా అవార్డు అందుకున్న కళాశాలకు చెందిన జి.శ్రీలతను, ప్రిన్సిపాల్ ఉమాదేవి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మంజుల, శేఖర్, వెంకన్న, రామారావు, రామిరెడ్డి, శ్రీనివాసులు, రాధ, ప్రమీల, యాదయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమ్మె



ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లు

ఆశవర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు సరస్వతి

కందుకూరు: సమస్యల పరిష్కారం కోరుతూ ఆశ వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నుంచి సమ్మె ప్రారంభించారు. సమ్మెలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజు, ఆశవర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు సరస్వతి మాట్లాడారు. 18 ఏళ్లుగా ఆశ వర్కర్లు గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వారి సేవలను గుర్తించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. వీరి సమ్మెకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.రాంచందర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు జయసుధ, ప్రేమలత, కవిత, సుజాత, సువర్ణ, సురేఖ, మంగ, స్వప్న, లక్ష్మీదేవి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు 'ప్రభుత్వ' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కార్పొరేటర్ స్వప్న, ఉపాధ్యాయులు

బడంగ్‌పేట్: ఇటీవల హనుమకొండలో నిర్వహించిన ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి (అండర్-17) పోటీల్లో బడంగ్‌పేట్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు సత్తా చాటారు. 9వ తరగతికి చెందిన విద్యార్థులు కె.ధనలక్ష్మి వంద మీటర్ల పరుగుపందెంలో, పి.నవ్య, ఎం.పల్లవి జావెలింగ్ త్రోలో, డి.పార్వతి కబడ్డీలో పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 2 నుంచి 8వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని విదిషాలో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ కె.అర్జున్ తెలిపారు. ఈ నెల 21న హైదరాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి టీటీఏ పోటీల్లోనూ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి ఎం.శ్రీచరణ్ టేబుల్ టెన్నిస్ విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయినట్లు తెలిపారు. ఈ మేరకు వారిని సోమవారం 30వ డివిజన్ కార్పొరేటర్ భీమిడి స్వప్న అభినందించారు.

'డబుల్' పంపిణీపై హైకోర్టు స్టే

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్



మాట్లాడుతున్న వీరేందర్‌గౌడ్, చిత్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్, సర్దార్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీపై హైకోర్టు స్టే విధించిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ తెలిపారు. సోమవారం శ్రీనగర్‌లోని ఆయన నివాసంలో పార్టీ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ పూర్తిగా అశాస్త్రీయంగా జరిగిందని ఆరోపించారు. రంగారెడ్డి రెవెన్యూ పరిధిలో నిర్మించిన ఇళ్లను స్థానికులకు కాకుండా జీహెచ్‌ఎంసీ పరిధిలోని యాకత్‌పురా, చంద్రాయణగుట్ట, మలక్‌పేట ప్రాంతాల వారికి ఎలా పంపిణీ చేశారని కోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించిందన్నారు. ఓ నియోజకవర్గ పరిధిలోని నిర్మించిన ఇళ్లలో స్థానిక ఎమ్మెల్యే కోటా 50శాతం, మంత్రికి 50 శాతం తీసుకునే హక్కుందన్నారు. మన నియోజకవర్గ ఎమ్మెల్యే మంత్రిగా ఉన్నప్పటికీ వాటిని స్థానికులకు ఇవ్వలేదన్నారు. మంఖాల్, సర్దార్‌నగర్‌లో 2,800 పైగా డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తే వాటిలో కేవలం 500 గదులు మాత్రమే స్థానికులకు ఇవ్వడంతో తాము ప్రజల తరఫున కోర్టును ఆశ్రయించామని చెప్పారు. స్థానిక నిరుపేదలందరికీ ఇళ్లు ఇచ్చిన తర్వాతే మిగిలిన వాటిని ఇతర ప్రాంతాల వారికి పంపిణీ చేయాలన్నామని చెప్పారు. నేడు కోర్టు ఇచ్చిన తీర్పు మున్సిపాలిటీ ప్రజల విజయమన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ విషయంలో తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధు మోహన్, కౌన్సిలర్ విలాస్, నాయకులు మధన్‌మోహన్, నర్సింగ్, శ్రీనివాస్‌నాయక్, శ్రీనివాస్ యాదవ్, అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.





బడంగ్‌పేట: బాలాపూర్ గణనాథుడి వద్ద పీసీసీ ఉపాధ్యక్షుడు అమరేందర్ రెడ్డి, బడంగ్‌పేట: గణపతి పూజలో పాల్గొన్న చిత్రం శ్రీను కుటుంబం

పూజలు.. నిమజ్జనాలు

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాల్లో పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. పలు మండపాల్లో గణేశ్ విగ్రహాలను శోభాయాత్రగా నిమజ్జనానికి తరలించారు. వివిధ పార్టీల నేతలు, నాయకులు ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

– మహేశ్వరం జోన్ బృందం



బడంగ్‌పేట: గణేశ్ నిమజ్జనంలో పాల్గొన్న మేయర్ పారిజాత, కార్పొరేటర్లు



తుక్కుగూడ: రావిర్యాలలో సర్దార్ పటేల్ యువజన సంఘం వద్ద..



హుడాకాంప్లెక్స్: వైశ్య వికాస వేదిక ఫౌండర్, చైర్మన్ సత్యనారాయణను సత్కరిస్తున్న బాలాపూర్ ఉత్సవ కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి



హుడాకాంప్లెక్స్: అన్నదానంలో పాల్గొన్న శంకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి



హుడాకాంప్లెక్స్: గణపతి పూజలో పాల్గొన్న పాంచజన్య యూత్ అసోసియేషన్



మీర్‌పేట్: జిల్లెలగూడలో విజయ హోమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల పూజలు

రోడ్డు వెడల్పు విషయంలో ఆందోళన వద్దు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: హస్తినాపురంలోని జిల్లాపరిషత్ రోడ్డు వెడల్పు విషయంలో ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నుండి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం వస్తుందని ఎల్‌బీనగర్ శాసన సభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని జిల్లాపరిషత్‌రోడ్డు ప్రధాన రహదారిలోని ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో జడ్పీ రోడ్డు వెంటఉన్న గృహాలు ,వాణిజ్యసముదాయాల యజమానుల సమావేశానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ రోడ్డును తెలంగాణ చౌరస్తా వరకు 100 ఫీట్ల వరకు వెడల్పు చేయాలని జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో తీర్మానం చేశారన్నారు. దీంతో తమ గృహాలు, షాపులు పూర్తిగా కూల గొట్టాల్సివస్తుందని దానిని 60 ఫీట్లకు పరిమితం చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి,మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్ పాల్గొన్నారు.